మాణిక్యాంబ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు



ద్రాక్షారామ, న్యూస్‌టుడే: అష్టాదశపీఠాల్లో 12వ పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం కానున్నాయి. 14వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఉదయం 6.35 గంటలకు కలశపూజతో ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో దుర్గాభవాని తెలిపారు. అమ్మవారికి రోజూ ఉదయం 4 గంటల నుంచి మేలుకొలుపు, తీర్థపుబిందె, బాల భోగం, లక్షకుంకుమార్చనలు జరుగుతాయి. 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు నిత్య అనుష్టానములు, వైదిక కలాపములు, మధ్యాహ్నం 1 నుంచి 3.30గంటల వరకు దేవులపల్లి ఫణిరామకృష్ణ 'శ్రీచక్రనవావరణార్చన', సాయంత్రం కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు ఉంటాయి.. ప్రతిరోజూ రాత్రి 6.30గంటల నుంచి అమ్మవారికి విశేష పుష్పాలు, సువర్ణపుష్పాలతో అర్చన నిర్వహిస్తారు.

ఎర్ర సముద్రం.. ఎదరకొచ్చిందండి!

ఇటీవల విడుదలైన 'దేవర' సినిమా గుర్తుందా.. అందులో కథంతా ఎర్ర సముద్రం చుట్టూనే తిరుగుతుంది. ఆ ఎర్ర సముద్రం ఇప్పుడు మన ప్రాంతానికీ వచ్చింది. ఎక్కడంటారా? కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం అమీనాబాద్ ఓడరేవు వద్ద.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద పెద్దవాగు రూపంలో సముద్రంలో కలుస్తోంది. దీంతో నీలిసాగరం కాస్త ఎరుపు, లేత, ముదురు నీలం రంగుల్లో చూపరులను ఆకట్టుకుంటుంది. గట్టును తాకుతుందా అన్నట్లు తొలుత ఎర్రనీరు పలకరిస్తుంది. సందర్శకులు తమ చరవాణుల్లో క్లిక్‌మన్పిస్తున్నారు. - ఈనాడు, కాకినాడ



వేతనాలు చెల్లించాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: తమకు బకాయి పడిన రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సమగ్రశిక్ష ఉద్యోగులు గడియారస్తంభం కూడలిలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 13 ఏళ్ల నుంచి పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికీ తమకు ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

వైకాపా పాపం.. ప్రగతికి శాపం

విడుదల కాని రూ.28.62 కోట్ల ఆర్థికసంఘం నిధులు

ఈనాడు, రాజమహేంద్రవరం: అయిదేళ్ల వైకాపా పాలనలో చూపించిన నిర్లక్ష్యం నగర పాలక సంస్థను, నగర పంచాయతీలకు గ్రహపాటుగా మారింది. ఈ ఏడాది 15వ ఆర్థిక సంఘం నిధుల్లో నగర విడుదల చేసినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని సంస్థలకు రాలేదు.. తద్వారా రాజమహేంద్రవరం, కాకినాడ కార్పొరేషన్లు, ఏలేశ్వరం నగరపంచాయతీ సుమారు రూ.28.62 కోట్ల మేర కోల్పోవాల్సి వచ్చింది.

పాలకవర్గాలు లేక..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు 2014లో ఎన్నికలు జరగ్గా ఆ పాలక వర్గం 2019 వరకు కొనసాగింది. గడువు ముగిసినప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలనలో ఉంది. అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో ఎన్నికల దిశగా అడుగులు వేసేందుకు కనీస కసరత్తు చేయలేదు. విలీన పంచాయతీలకు సంబంధించిన కొన్ని న్యాయపరమైన చిక్కులు పరిష్కరించడంలోనూ విఫలమే. సాధారణంగా 15వ ఆర్థిక సంఘం ద్వారా ఏటా సుమారు రూ.35 కోట్ల మేర నిధులు ఈ కార్పొరేషన్‌కు మంజూరవుతుంటాయి. మొదటి విడతలో రూ.17.5 కోట్లు అందాల్సి ఉండగా పాలక వర్గాలు లేక కేంద్రం విడుదల చేయలేదు.

■ కాకినాడ నగరపాలక సంస్థకు తెదేపా ప్రభుత్వ హయాంలో 2017లో ఎన్నికలు నిర్వహించగా ఆ పాలకవర్గం 2022 సెప్టెంబరు 15 వరకు కొనసాగింది. ఇక్కడ ఐదు గ్రామాల విలీనానికి సంబంధించిన న్యాయపరమైన వివాదాలున్నాయి. వీటిని పరిష్కరించడంలో వైకాపా సర్కారు పొరపాట్లు చేసింది. నగరపాలక సంస్థకు పాలకవర్గం లేక ఆర్థిక సంఘం నిధులు కేంద్రం మంజూరు చేయలేదు. ఇక్కడ సగటున ఏడాదికి సుమారు రూ.20 కోట్లు వస్తుంటాయి. ఈ విడతలో దాదాపు రూ.10 కోట్లు మంజూరవుతాయని భావించినా మొండి చేయే ఎదురైంది.



రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం

ఆదాయ వనరులు పెంచుకోనందున..

ఏలేశ్వరం నగర పంచాయతీకి పాలకవర్గం ఉన్నా కేంద్ర నిబంధనల మేరకు ఆదాయాన్ని వృద్ధి చేసుకోవడంలో విఫలమైంది. దీంతో తొలివిడత విడుదలవ్వాల్సిన సుమారు రూ.1.12 కోట్లు రాలేదు. కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులు రావాలంటే పాలకవర్గం ఉండాలి. ఆయా స్థానిక సంస్థల ఆదాయం ఏటా 12.01 శాతం పెరుగుదల నమోదవ్వాల్సి ఉంటుందనే నిబంధన ఉంది. ఇది ఏలేశ్వరానికి శరాఘాతంగా మారింది. ఏటా సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తే అభివృద్ధి చేసుకునే అవకాశం ఉండేది. పంచాయతీకి 2022-23లో పన్నుల డిమాండ్ రూ.1.92 కోట్లు కాగా రూ.1.08 కోట్లు మాత్రమే వసూలైంది. 2023-24లో రూ.1.48 కోట్లకు రూ.1.18 కోట్లు మాత్రమే వసూలుచేయగలిగారు.

పారిశుద్ధ్యం, అభివృద్ధికి అవకాశం..


కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో 50 శాతం మేర పారిశుద్ధ్యం, కాలువల నిర్మాణం తదితర అవసరాలకు, మిగతా 50 శాతం నిధులతో సాధారణ, సుందరీకరణ పనులు చేసుకోవచ్చు. గత పాలకులకు కొరవడిన ముందుచూపు, విడుదల చేసిన నిధులు ఇతర అవసరాలకు మళ్లింపు వంటి వ్యవహారాలు సమస్యకు కారణమయ్యాయి.

విక్రయ కష్టాలకు సెలవిక

■ ధాన్యం సేకరణకు విధివిధానాలు ఖరారు
■ కోనసీమలో 2.30 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ప్రకృతి ఆటుపోట్లను తట్టుకొని సేద్యం చేసే రైతులకు సాంత్వన చేకూర్చేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సకాలంలో సేకరించి 48 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా కార్యాచరణ ప్రారంభించింది. ఈనెలాఖరు నాటికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనుంది. రైతు సేవా కేంద్రాల ద్వారా విధివిధానాలను రూపొందించి పౌరసరఫరాల శాఖ ఇటీవల జీఓ.ఎంఎస్ నెం.11ను విడుదల చేసింది. దీంతో అత్యధికంగా వరి పండించే మన జిల్లాలో చకచకా అడుగులు పడుతున్నాయి.



గతంలో ఎన్ని ఇబ్బందులో..

వైకాపా ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలుకు పాలకుల హడావిడి తప్ప.. రైతుల నుంచి తీసుకున్నది అంతంతమాత్రమే. కొనుగోలు కేంద్రాలకు వచ్చేవారికి సవాలక్ష కొర్రీలు పెట్టేవారు. వాహనాలు సమకూర్చలేదు. తీరా రైతులే నానా అవస్థలు పడి మిల్లుల వద్దకు తీసుకువెళ్తే దిగుమతి చేసుకోక ఇబ్బందులకు గురి చేసేవారు. మిల్లర్ల మాయాజాలంతో గిట్టుబాటు ధర అందని ద్రాక్షగానే మిగిలిపోయేది.

రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ క్రాప్ నమోదు చేయించుకున్న ప్రతి రైతు వద్ద గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేసేలా ప్రస్తుతం చర్యలు తీసుకోనున్నారు.

ఇప్పుడు ఇలా..

గ్రామ సభలు నిర్వహించి రైతులు సూచించిన మిల్లులకే ధాన్యం రవాణా చేస్తారు. సేవా కేంద్రాల్లోని సాంకేతిక సిబ్బంది తేమ శాతం చూసి.. నిబంధనల మేరకు ఉన్నట్లు నిర్ధారిస్తే అదే అంతిమం. స్థానిక మార్కెట్‌లో మంచి ధర లభిస్తే అక్కడా అమ్ముకోవచ్చు. ధాన్యం మిల్లుకు చేరిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయి. క్షేత్ర స్థాయిలో ఈ క్రాప్ చేయించుకున్న వారి జాబితాలు, ఆధార్ అనుసంధాన బ్యాంకు ఖాతాలను ఈమేరకు సిద్ధం చేస్తున్నారు. సీఎంఆర్ మిల్లులకు రైతులు సొంతంగా వాహనాలు సమకూర్చుకుని ధాన్యం రవాణా చేస్తే.. ఛార్జీలు రైతు ఖాతాల్లో వేస్తారు.



కార్యాచరణ ప్రారంభించాం..

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించాం. గోనె సంచుల కొరత లేకుండా సిద్ధం చేయనున్నాం. తేమ యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాటాలను ప్రతి ఆర్‌ఎస్‌కే వద్ద ఉంచుతాం. సాంకేతిక సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నాం.

-ఎ.పాపారావు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఈ ఖరీఫ్ సీజన్ నుంచి కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.117 మద్దతు ధర పెంచింది. ప్రస్తుత సీజన్‌లో 'ఏ' గ్రేడు ధాన్యం 2,320 (75 కిలోల బస్తా రూ.1740), సాధారణ రకం క్వింటాలుకు రూ.2,300 లకు (75 కిలోల బస్తా రూ.1725) రైతుకు దక్కేలా చర్యలు చేపట్టారు.

గాంధీజీ స్ఫూర్తితో స్వచ్ఛాంధ్రప్రదేశ్





స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తూ..

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో సేవలందించిన వారికి ప్రశంసా పత్రాలతో సత్కరిస్తున్న ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం కలెక్టరేట్: గాంధీ స్ఫూర్తితో స్వచ్ఛాంధ్రప్రదేశ్ దిశగా ముందడుగు వేసి మంచి ఫలితాలు సాధించామని అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో స్వచ్ఛతా హీ సేవా ముగింపు నిర్వహించారు. గత 15 రోజులుగా కార్మికులు, అధికారులు ఉన్నత సేవలు అందించారన్నారు. భారతావని శ్రేయస్సు శుభ్రతతో ముడిపడి ఉందని మహాత్ముడు అనేవారన్నారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ప్రతి కార్యాలయం పరిధిలో పరిశుభ్రతను పాటించాలన్నారు. వ్యర్థాలను గంగలో కలిపే సంస్కృతి విడనాడాలన్నారు. జేసీ నిశాంతి మాట్లాడుతూ 385 పంచాయతీల పరిధిలో స్వచ్ఛతాహీ సేవా చేపట్టినట్లు తెలిపారు. 22 మంది గ్రామ సర్పంచులు, సఫాయి మిత్రలు, పంచాయతీ కార్యదర్శులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. డీఆర్వో వెంకటేశ్వర్లు, డీపీవో రాంబాబు పాల్గొన్నారు.

టెట్‌కు వేళాయే..!

నేటి నుంచే పరీక్షలు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: గడిచిన అయిదేళ్లుగా వైకాపా ప్రభుత్వ పాలనలో ఒక్క డీఎస్సీ నిర్వహించ లేదు. ఉపాధ్యాయ కొలువుల కోసం అభ్యర్థులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూశారు. తెదేపా కూటమి అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 16వేల పైగా పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి టెట్(టీచర్ ఎలిజి బులిటీ టెస్ట్)ను గురువారం నుంచి నిర్వహిస్తున్నారు.



ఇటీవల భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన టెట్ పరీక్షకు హాజరైన అభ్యర్థులు

జిల్లాలో ఒకే కేంద్రం..

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం మండలం భట్లపాలెంలోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో మాత్రమే టెట్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఈ నెల 3వ తేదీ నుంచి 10 వరకు, 15 నుంచి 20 వరకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, ఇతర ఉపాధ్యాయ అర్హత పరీక్షలు నిర్వహించనున్నారు. 14 రోజుల్లో రెండు పూటలా 28 విడతలుగా 1,610 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు.

టీసీఎస్‌కు నిర్వహణ బాధ్యత..

టెట్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం టీసీఎస్ సంస్థకు అప్పగించింది. పరీక్ష సమయంలో విద్యుత్తు, అంతర్జాల సేవలకు అంతరాయం ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. కంప్యూటర్లు మొరాయిస్తే తక్షణం మరమ్మతులు నిర్వహించేందుకు అవసరమైన టెక్నీషియన్లను పరీక్ష కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచుకోవాలని కళాశాల యాజమాన్యాలకు సూచించారు.

అభ్యర్థులకు దూరాభారం..

జిల్లాలో టెట్ రాసేందుకు సుమారు 12వేల మంది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కొంత మందికి బెంగళూరు, విజయవాడ, విశాఖలో కేంద్రాలు కేటాయించారు. అక్కడకు వెళ్లడమే పెద్ద పరీక్షగా మారిందని అభ్యర్థులు వాపోతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని యాజమాన్యాలు టెట్ నిర్వహణకు తమ కళాశాలలను కేటాయించక పోవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు సమాచారం. టెట్ జరుగుతున్న రోజుల్లోనే పలు బ్యాంకు పరీక్షలు ఉండటంతో పరీక్ష కేంద్రాల కొరత ఏర్పడినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

జిల్లాలో భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో మాత్రమే టెట్ నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేశారు. పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో బ్యాచ్‌కు పరీక్ష జరుగుతుంది. -కమలకుమారి, డీఈవో

కాలువలను కమ్మేసిన నిర్లక్ష్యం!



లొల్ల మీడియం కాలువ పరిస్థితి

ఆత్రేయపురం, లొల్ల, కట్టుంగ మీడియం, దేవరబంద డ్రెయిన్లు పూడికతో అధ్వానంగా మారాయి. వర్షమొస్తే వరద పంట కాలువల్లోకి ముంచెత్తుతోంది. సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు పంట దెబ్బతింటోందని రైతులు వాపోతున్నారు. కట్టుంగ మీడియం డ్రెయిన్ శివారు అంకంపాలెం అవుట్‌పాల్ స్లూయిస్ వద్ద గోదావరి చెంతన పూడికలు తొలగించలేదు. నవంబరులో వర్షాలు పడితే ఇబ్బందులు తప్పవని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. లొల్ల, వాడపల్లి పంట పొలాలు ముంపునకు గురికాకుండా మెర్లపాలెం వద్ద భూగర్భ డ్రెయిన్ కడతామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చినా రూపుదాల్చలేదు. కొందరు రైతులు ఇటీవల అంకంపాలెం వద్ద శ్రమదానం చేసి కాలువల్లోని చెత్త తొలగించారు. ఈ సమస్యను జలవనరుల శాఖ పర్యవేక్షకుడు రమేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా పూడికలు తీయించేందుకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని చెప్పారు. -న్యూస్‌టుడే, ఆత్రేయపురం

స్వామీ.. సౌకర్యాల లేమి!

అంతర్వేదిలో పార్కింగ్ లేక భక్తుల ఇక్కట్లు

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి భక్తుల తాకిడి అధికంగానే ఉంటుంది. అందుకు తగ్గట్టు సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామి దర్శనానికి సాధారణ రోజుల్లో 5 వేలకు పైగా భక్తులు వస్తుంటారు. శని, ఆదివారాల్లో ఆ సంఖ్య 10 వేల నుంచి 15 వేల వరకు ఉంటుంది. ఇక దసరా, సంక్రాంతి, ఇతర పర్వదినాల్లో ఈ సంఖ్య 30 వేలకు పైగా ఉంటుంది. వాహనాల ద్వారా వచ్చి స్వామివారి దర్శనం చేసుకుని, స్థానిక సముద్ర తీరాన్ని సందర్శించి వెళ్తుంటారు.

చిత్తడిగా స్థలం..



కల్యాణ మండపం వెనుక భాగం దుస్థితి

భక్తులు వచ్చిన వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. ఆలయం దక్షిణ గోపురం వద్ద ఉన్న చిన్నపాటి స్థలంలో 30 వాహనాలు మించి పట్టవు. కల్యాణ మండపం సమీపంలో ఉన్న ప్రదేశం ఛిద్రంగా తయారైంది. ఇక్కడ పార్కింగ్ చేసుకుందామంటే చిన్నపాటి వర్షానికే మట్టి, బురదతో చిత్తడిగా మారుతుంది. దీంతో అధిక శాతం భక్తులు తమ వాహనాలను పరిసర ప్రాంతాల్లో ఉన్న రహదారులపై నిలిపేసి వెళ్లడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. దర్శనం అనంతరం ఆర్టీసీ బస్సుల కోసం వేచి చూసేటప్పుడు ఎండలోనే నిల్చోవాల్సి వస్తోందని, కనీసం దేవస్థానం అధికారులు బస్సుషెల్టర్ కూడా నిర్మించలేదని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు స్పందించి సీసీ ప్లాట్‌ఫారాలు, బస్సు షెల్టర్ నిర్మించాలని అంతా విజ్ఞప్తి చేస్తున్నారు. దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

4 నుంచి యానాం మీసాల వెంకన్న బ్రహ్మోత్సవాలు

యానాం, న్యూస్‌టుడే: యానాం ప్రజల ఆరాధ్యదైవం మీసాల వెంకన్న 22వ వార్షిక బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి నిర్వహించడానికి పుదుచ్చేరి దేవాదాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది. రూ.7 కోట్ల వ్యయంతో శ్రీవారి ఆలయ నిర్మాణం చురుగ్గా సాగుతున్న నేపథ్యంలో బాలాలయంలో పరిమిత స్థాయిలో ఉత్సవాల్ని నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఖండవిల్లి రామకృష్ణ తెలిపారు. ఈ నెల 4 నుంచి 13 వరకు రోజూ ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు.



క్రీడాకారులకు దిశా నిర్దేశం చేస్తున్న ఏఎస్ఎన్ మూర్తి

క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి

97 పాఠశాలల నుంచి 1400 మంది హాజరు

రాజానగరం, తుని, న్యూస్‌టుడే: రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఈనెల మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని సీబీఎస్ఈ క్లస్టర్ -7 పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని 97 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి 135 వాలీబాల్ జట్లు, సుమారు 1400 మంది క్రీడాకారులు, 150 మంది కోచ్‌లు, రిఫరీలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 30 మంది హాజరవుతున్నారు. పోటీల పర్యవేక్షణకు సీబీఎస్ఈ దిల్లీ నుంచి పరిశీలకుడు వస్తున్నారు. ఈ మేరకు పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సీహెచ్.విజయప్రకాష్ బుధవారం మాట్లాడుతూ అతిథులందరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నిరకాల వసతులు కల్పించామన్నారు. ప్రిన్సిపల్ ఏఎస్ఎన్ మూర్తి, క్రీడల సమన్వయకర్త గంగాధర్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు దిశా నిర్దేశం చేశారు.

రైస్ మిల్లుల అభివృద్ధికి కృషి: ఎంపీ హరీష్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: రైస్ మిల్లు పరిశ్రమ భవిష్యత్తు కోసం నిర్ణయాలు తీసుకుంటామని ఎంపీ హరీష్ మాథుర్ పేర్కొన్నారు. అమలాపురంలోని వేడుకమందిరంలో బుధవారం కోనసీమ రైస్ మిల్లర్స్ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, దాట్ల బుచ్చిరాజు, గిడ్డి సత్యనారాయణ, దేవవరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం సంఘ సభ్యులను అభినందించారు. అనంతరం వారిని సన్మానించారు. లక్ష్మీనారానాయణ, పిప్పళ్ల రాంబాబు, భాజపా జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ హరీష్ మాథుర్‌ను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

లడ్డూ ప్రసాదం అపవిత్రం చేసినవారిపై చర్యలు

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష విరమణ పురస్కరించుకుని బుధవారం పి.గన్నవరం నుంచి లంకలగన్నవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. నియోజకవర్గ తెదేపా కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరం నుంచి పాదయాత్రగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు

శ్రీపీఠంలో మహాశక్తి యాగం

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణం రమణయ్యపేట శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల్లో గురువారం నుంచి 13 వరకు మహాశక్తియాగం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. బుధవారం శ్రీపీఠం గోశాలలో మహాశక్తియాగం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. తెలుగు రాష్ట్రాల నుంచి రోజూ 35 వేల మందికి పైగా మహిళా భక్తులు ఎరుపు వర్ణ ఏకరూప దుస్తులతో కుంకుమ పూజలు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. 10వ దుర్గాష్టమి రోజు సుమారు 64 మంది భక్తులు శ్రీలలిత సహస్రవిరాట్ పారాయణ, పూజలు చేస్తారన్నారు. 9న మూలా నక్షత్రం పురస్కరించుకుని సుమారు 24 వేల మంది విద్యార్థులు 3 కోట్ల మహాసరస్వతి అనుష్టానం పూజలు చేయడానికి ఇప్పటికే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. అమ్మవారికి రోజుకొక అలంకరణ, బగళాముఖి హోమాలు శాంతికర కల్యాణం కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దసరా ఉత్సవాల్లో సుమారు 4 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ చేస్తామని చెప్పారు. తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీపై మాట్లాడుతూ వివాదం కోర్టు పరిధిలో ఉన్నందున ఎటువంటి వ్యాఖ్యలు చేయనని, కోర్టు తీర్పు వచ్చిన తర్వాత స్పందిస్తానని తెలిపారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పరిపూర్ణానందస్వామి

ఒరిగి.. తిరిగి.. పెరిగి

సగంలో కాండం వంగి తిరిగి నిటారుగా పెరుగుతున్న ఈ కొబ్బరి చెట్టు చూపరులను ఆకర్షిస్తోంది. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో ఉన్న ఈ చెట్టు గతంలో వచ్చిన తుపానుకు మొవ్వ పక్కకు ఒరిగిపోయింది. కొన్నాళ్లకు తిరిగి పుంజుకుని అక్కడి నుంచి నిటారుగా నిలిచింది.

-న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం



బరువు కాదు.. భవిష్యత్తుపై బాధ్యత

తాళ్లరేవు మండలం చొల్లంగిపేట బాలికల గురుకుల పాఠశాలకు దసరా సెలవులిచ్చారు. విద్యార్థినులను ఇంటికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు బుధవారం ఉదయాన్నే గురుకులానికి చేరుకున్నారు. తల్లిదండ్రులు పిల్లల బ్యాగులు, పెట్టెలను నెత్తిపై పెట్టుకుని ఇంటికి బయలుదేరారు.


-న్యూస్‌టుడే, తాళ్లరేవు



చిత్ర నివాళి

గాంధీ జయంతిని పురస్కరించుకుని చిత్రకారుడు నల్లి సంగీత్ గీసిన చిత్రం ఆకట్టుకుంటోంది. శాంతి, అహింస ఆయుధాలుగా పోరాటం చేసి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన నాటి సంఘటనలను కళ్లకు కట్టినట్లు ఇందులో చూపించారు.

-న్యూస్‌టుడే, మలికిపురం



ఎగసిపడిన కొబ్బరి ధరలు

రూ.4 వేల పతనం దిశగా కోనసీమ కొబ్బరి మార్కెట్



అంబాజీపేటలోని కొబ్బరి కాయల రాశి

అంబాజీపేట, న్యూస్‌టుడే: కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. పది రోజుల క్రితం వెయ్యి కొబ్బరికాయలు (సెప్టెంబర్-22,23వ తేదీల్లో) రూ.18,000 ధర పలికి కొబ్బరిమార్కెట్ చరిత్రలో అరుదైన రికార్డుగా నమోదైయింది. ఇప్పుడు అవే వెయ్యికొబ్బరికాయల ధర రూ.4 వేలు పతనమై స్థానిక కొబ్బరిమార్కెట్‌లో రూ.14,000 లకు పడిపోయింది. కోనసీమలోని ప్రాంతాలను బట్టి ఈ ధర ఇంకా దిగజారినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవీ శరన్నవరాత్రులకు సంబంధించిన దసరా అమ్మకాలు పూర్తికావటం.. పొరుగు రాష్ట్రాల వర్తకులు కొనుగోలును తగ్గించటం వంటి కారణాలతో ఇక్కడి ప్రాంతీయ మార్కెట్‌లో ధర ఒక్కసారి రూ.4వేలు పతనమైంది.

ఎంత వేగంగా ధర పెరిగిందో.. అంతే వేగంగా పతనమైందని వ్యాపార విశ్లేషకులు అంటున్నారు. పచ్చి కొబ్బరికాయలు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎగుమతులు జరిగాయి. ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికే దసరా కొనుగోళ్లు పూర్తి కావొచ్చాయి. దీంతో అక్కడి వ్యాపారులు కొబ్బరికాయల కొనుగోలును నెమ్మదిగా జరుపుతున్నారు. ఆ ప్రభావం కోనసీమ కొబ్బరిమార్కెట్‌పై పడింది. ఇక్కడి కొబ్బరిరైతులతో పాటు వ్యాపారులు తమ వద్ద ఉన్న కాయలకు ఇంకా మంచి ధర(రూ.18,000)దాటి వస్తుందనే ఆశతో విక్రయించకుండా ఉన్నారు. ఇప్పుడు ధర పతనంతో దిగాలు పడుతున్నారు.

రూ.వెయ్యికొబ్బరికాయల ధర రూ.17,000 నుంచి రూ.18,000 పలికిన సమయంలో అమ్ముకున్న కర్షకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కురిడీ కొబ్బరికాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు పది రోజుల క్రితం వరకు ఆశాజనకంగానే సాగాయి. ఇప్పుడు వీటికీ డిమాండ్ తగ్గటంతో మార్కెట్ ధరలు నెమ్మదించాయి. రానున్న దీపావళి పండుగకు మళ్లీ కొబ్బరికాయలకు మంచి ధరలు వస్తాయని కోనసీమ కొబ్బరిరైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విత్తన బంతులతో వెల్లివిరిసేలా పచ్చదనం

తాళ్లరేవు వాసవీ క్లబ్ కపుల్స్, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక వాసవీ మాత మందిరంలో బుధవారం మట్టితో విత్తన బంతులను తయారు చేశారు. ఇక్కడ సిద్ధం చేసిన 12వేల బంతులను రహదారులకు ఇరువైపులా వేసినట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి అద్దేపల్లి సుధ, దాసరి భారతి, గోకవరపు శ్రీదేవి తెలిపారు. అందులో రావి, వేప, నేరేడు, సపోటా విత్తనాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వర్షాలు పడినప్పుడు అవి మొలకెత్తి పచ్చదనం పెంపొందడానికి తోడ్పడతాయన్నారు. సామా ప్రకాష్, గోకవరపు సుభాష్, అద్దేపల్లి సత్తిరాజు, పేకేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, తాళ్లరేవు



తాళ్లరేవులో మట్టితో సీడ్ బాల్స్‌ను తయారు చేస్తున్న వాసవీ క్లబ్ కపుల్స్, యూత్ సభ్యులు

అట్టహాసంగా పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభం

అంగర, న్యూస్‌టుడే: మానసిక, శారీరక ఆరోగ్యానికి ధ్యాన మార్గం అనుసరణీయమని పలువురు వక్తలు అన్నారు. కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రిక గ్రామంలోని ఉయ్యాల జంపాల క్షేత్రం వద్ద నూతనంగా నిర్మించిన ఖణ్వ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ధ్యాన మందిరం వద్ద ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహాన్ని ఉండ్రాజవరం భౌద్ధ దమ్మ పీఠానికి చెందిన పూజ్యబంతే అనాలయో ఆవిష్కరించారు. ధ్యాన మందిరాన్ని విశాఖపట్టణం ప్రకృతి వ్యాలీ అధినేత దాట్ల రాయి జగపతిరాజు, గ్రంథాలయాన్ని తూర్పుగోదావరి జిల్లా పిరమిడ్ సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి విజయభాస్కరరెడ్డి, అన్నపూర్ణ దంపతులు ప్రారంభించారు. తొలుత అంగర అశిరాంబ అమ్మవారి ఆలయం వద్ద నుంచి ధ్యాన కేంద్రం వరకు మహాకరుణ శాకాహార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థల దాత కరాటపు కృష్ణకాంతరావు, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు గణేష్, రమణ, పిరమిడ్ కమిటీ ఉపాధ్యాక్షుడు వల్లూరి వీర వెంకట సత్యనారాయణ, అంగర, పడమర ఖండ్రిక సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, వందలాది మంది ధ్యానసాధకులు పాల్గొన్నారు.



బుద్ధ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భౌద్ధ దమ్మ పీఠాధిపతి అనాలయో

మహాలయ అమావాస్య.. పిండ ప్రదానాలు

పిఠాపురం: మహాలయ అమావాస్య కావడంతో బుధవారం తెల్లవారుజాము నుంచే పితృ దేవతలకు పిండ ప్రదానాలు నిర్వహించేందుకు పిఠాపురం పాదగయ క్షేత్రంలో భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. హోటళ్లు సైతం నిండుకున్నాయి. మొత్తం 2,500 మంది పిండ ప్రదానాలు చేశారు. పాదగయ కూడలిలో ట్రాఫిక్ సమస్య తలెత్తగా పోలీసులు రంగంలోకి దిగి నియంత్రించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పలువురు రాజకీయ నాయకులు పిండ ప్రదానాలు చేశారు. దర్శనాలు, సేవలు, ప్రసాదాలు, అన్న ప్రసాద విరాళాలు, వసతి, పిండ ప్రదాన టిక్కెట్ల రూపంలో రూ.5,89,029 ఆదాయం సమకూరిందని ఈవో విశ్వనాథరాజు తెలిపారు.



పాదగయలో..

ఖైదీల్లో పరివర్తన రావాలి

దానవాయిపేట (రాజమహేంద్రవరం): కారాగారాల్లోని ఖైదీల్లో పరివర్తన తీసుకువచ్చే దిశగా జైలు అధికారులు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం కారాగారంలోని మహిళా జైలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా తొలుత బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జైలులో మహిళా ఖైదీలకు అందుతోన్న వసతులపై ఆరా తీశారు. ఖైదీలకు నిర్వహించిన ఆటపాటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఖైదీల పిల్లలకు బొమ్మలు, దుస్తులు, పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా జైలు ఆశ్రమ వాతావరణంలో ఉన్నట్లు ఉందన్నారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీల రిలీజు విషయాల్లో సిఫార్సు చేస్తామని తెలిపారు. ఖైదీల సమస్యలు, వారి కేసులు వివరాలు డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకు రావాలన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, అధికారులు విజయకుమారి, డాక్టర్ లక్ష్మి సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.



ఖైదీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

శిక్షణతో జైళ్ల శాఖకు ఆదాయం

కేంద్ర కారాగారాల్లో వృత్తివిద్యా శిక్షణ పొందడం ఖైదీలకు ఆర్థిక భరోసాగా ఉంటుందని గంధం సునీత అన్నారు. పురుషుల జైలులో నిర్వహించిన కార్యక్రమంలోనూ ఆమె పాల్గొన్నారు. శిక్షణ పొందడం ద్వారా ఖైదీలు బయటకు వెళ్లిన తరవాత జీవనోపాధి మార్గం లభిస్తుందన్నారు. జైళ్ల శాఖలకూ ఆదాయం సమకూరుతుందన్నారు. ఇటీవల పలు కోర్టులకు సంబంధించి రూ.60 లక్షల విలువ చేసే ఫర్నిచర్‌ను జైళ్లశాఖ ద్వారా కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఆర్.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

భళా.. నఖ చిత్ర కళ

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆయనకు చేతి గోళ్లే కుంచెలవుతాయి. వర్ణాలు లేకుండానే ఆ చిత్రాలు సజీవ రూపాలుగా గోచరిస్తాయి. వాటిని గీస్తున్న చిత్రకారుడు కొవ్వూరు మండలం చిడిపికి చెందిన పరస రవి. 16వ శతాబ్దంలో తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాల్లో బోధనాంశంగా ఉన్న నఖ చిత్ర కళకు ఆ వైభవాన్ని తేవాలన్న సంకల్పం బూనారు. ప్రస్తుతం చేతిరాత, వ్యక్తిత్వ వికాస నిపుణునిగా రాణిస్తున్నారు. సొంతూరిలో వ్యవసాయం చేస్తూ రాజమహేంద్రవరంలో ఉంటూ ఇంజినీరింగ్, మెడికల్, పీజీ కళాశాలల్లో విద్యార్థులకు చేతిరాతతో పాటు యువతను ముఖాముఖిలకు సన్నద్ధం చేస్తున్నారు.

3,910 గణపతులు..

13 సంవత్సరాలుగా నఖ చిత్రాలు గీస్తున్న రవి ఇప్పటివరకు 3,910 గణపతి చిత్రాలకు రూపమిచ్చారు. 1,200 వరకు ఓంకార, శివుడితో ఉన్నట్లుగా 800, వల్లభ, లక్ష్మీగణపతి ఇలా 32 రూపాల్లో గణపతులను గీశారు.

అవార్డులు, ప్రశంసలు..

ఈయన విభిన్న రూపాల్లో గణపతి చిత్రాలను గీసి తెలుగు, భారత్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం పొందారు. 2018 ఉగాది పురస్కారాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. 2016లో కాలిఫోర్నియాలోని బర్కీ విశ్వవిద్యాలయం 'గౌరవ డాక్టరేట్' ప్రదానం చేసింది. నఖచిత్ర కళలో ప్రతిభ కనబర్చి ఇప్పటివరకు 17 బిరుదులు అందుకున్నారు. గాయకుడు బాలసుబ్రహ్మణ్యంకు చిత్రం గీసి ఇవ్వగా ఆయన ఎంతో ఆనందపడి రవిని సన్మానించారు.





గోటితో గీసిన చిత్రాలు..

పూర్వవైభవం తేవాలని..

నాకంటూ ఓ ప్రత్యేకత కోసం నఖ చిత్రాలను గీయడం అలవర్చుకున్నాను. చదువొక్కటే కాకుండా విద్యార్థులకు ఇష్టమైన అంశాల్లో ప్రావీణ్యం పెంచాలి. వారిలో ఉన్న సృజనను ఆదరించాలి. విద్యార్థులకు వీటిని నేర్పిస్తూ ఈ కళకు పూర్వ వైభవం తేవాలని శ్రమిస్తున్నాను.

\- పరస రవి



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడితో పరస రవి (పాత చిత్రం)

వివిధ కోర్సులు, ఉద్యోగావకాశాలకు ఉచిత శిక్షణ

మామిడికుదురు: గెయిల్ నైపుణ్య శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మామిడికుదురులోని పద్మభూషణ్ బోయి భీమన్న మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పలు కోర్సులు, ఉద్యోగావకాశాలకు ఉచిత శిక్షణ తరగతులను అర్హత ఉన్న వారంతా సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ ఎ.సురేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ, డిప్లొమా అర్హతలున్న వారంతా చేరొచ్చన్నారు. వివరాలకు 8897999099 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఖాదీకి పూర్వవైభవం తీసుకురావాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: ఖాదీ వస్త్రాలకు పూర్వ వైభవం తీసుకు రావాలని కోరుతూ 106 మంది మహిళలతో ఖాదీ వాక్ నిర్వహించామని ఆంధ్రకేసరి యువజన సమితి ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కోటిపల్లి బస్టాండ్‌లోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో దీనిని ప్రారంభించారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

రూ.13 లక్షల విలువైన వస్తువుల స్వాధీనం

కొత్తపేట న్యూస్‌టుడే: చెడు వ్యసనాలకు బానిసలై చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి వారి నుంచి బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తపేటలోని బ్యాంకు కాలనీకి చెందిన రామోజు అనురాధ కుటుంబ సభ్యులతో మే నెల 5న రాజమహేంద్రవరం వెళ్లారు. అదేనెల 9న తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు బద్దలు కొట్టి బీరువాలోని బంగారం, వెండి వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించడం గమనించారు. దీంతో ఆ సమయంలో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేశారు. సీఐ విద్యాసాగర్, కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర సిబ్బందితో కలిసి ఇద్దరు నేరస్థులైన బండారు మణికంఠ, చింతపల్లి వెంకటరాజులను వాడపాలెంలో అరెస్టు చేశారు. వారి నుంచి 212 గ్రాముల బంగారం, 2 కేజీల వెండి, ఖరీదైన వాచ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.13,00,000 ఉంటుందని సీఐ తెలిపారు. కేసు చేధించిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో సీఐ విద్యాసాగర్, ఎస్సై

కొడవలి పుష్కర కాలువలో బాలుడి గల్లంతు

గొల్లప్రోలు: కొడవలి శివారు పుష్కర కాలువలో అదే గ్రామానికి చెందిన ముప్పన బోయిన సతీష్ (15) బుధవారం గల్లంతైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. తాటిపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సతీష్ ఉదయం బహిర్భూమికి పుష్కర కాలువ దగ్గరకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో వెదికారు. కాలువలో సతీష్ పాదరక్షలు కనిపించడంతో ప్రమాదవశాత్తూ జారిపడి గల్లంతైనట్లు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఎన్.రామకృష్ణ సిబ్బందితో అక్కడికి చేరుకుని, ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి తండ్రి వీరవెంకట సత్యనారాయణ చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



కాలువలో గాలిస్తున్న ఈతగాళ్లు (అంతరచిత్రం) సతీష్ (పాత చిత్రం)

రూ.5.86 లక్షల ఆయిల్ స్వాధీనం

మామిడికుదురు: పాశర్లపూడి లంకలో 47 పీపాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.5.86 లక్షల విలువైన సాల్వెంట్ ఆయిల్‌ను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి అదే గ్రామానికి చెందిన రాచకొండ వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చైతన్యకుమార్ బుధవారం తెలిపారు. ఏవిధమైన అనుమతులు లేకుండా తెచ్చిన 9,400 లీటర్ల ఆయిల్‌ను పౌరసరఫరాల శాఖకు అప్పగించామన్నారు. డీటీ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు చెప్పారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూIIలలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,000
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ	15,000-15,500
కొత్త (పచ్చి) కాయ	14,000-14,500
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూIIలో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

పూర్తిస్థాయిలో ఉపాధిహామీ పనులు: ఏపీడీ

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో అందరికీ పనులు కల్పించడంతో పాటు రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పి.గన్నవరం ఏపీడీ మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని గోపాలపురంలో జరిగిన ఉపాధిహామీ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఉపయోగపడేలా ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సర్పంచి మోహనరావు, ఆవుల రామకృష్ణ, ఏపీఓ కవిత, అధికారి నాగు తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో స్వచ్ఛతా హీ సేవా

మామిడికుదురు, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయ ప్రాంగణంలో సిబ్బంది బుధవారం పరిసరాలను శుభ్రం చేశారు. గోశాల, ఆలయం చుట్టూ చెత్తాచెదారాన్ని తొలగించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి భీమవరం లోని పాలకోడేరుకు చెందిన కందుల సాఫ్ట్‌వేర్ శివప్రసాద్ రూ.లక్ష విరాళాన్ని బుధవారం అందజేశారు. వీరికి స్వామివారి చిత్రపటం అందించి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధరరావు అభినందించారు.



దాతకు స్వామి చిత్రపటం అందిస్తున్న డీసీ చక్రధరరావు

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు సందనం

చెత్తాచెదారాలు శుభ్రం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని కొత్తకాలనీలో రోడ్డు చెంతన పెద్దఎత్తున చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ వద్ద ప్రస్తావించగా సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

తాగునీటి పైపులైన్ వాల్వుకు మరమ్మతులు

మామిడికుదురు: ఆదుర్రు శివారు మేరిపాలెంలో మంచినీటి ట్యాంకు వద్ద వాల్వు దెబ్బతిని నీటి సరఫరా నిలిచిపోవడంపై స్థానికులు సర్పంచి బళ్ల శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా వెంటనే స్పందించారు. ఎయిర్‌వాల్వుకు మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరా పునరుద్ధరించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

అమ్మ పూజకు వేళాయె..

దసరా ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

అంతర్వేది, పి.గన్నవరం, అంబాజీపేట, న్యూస్‌టుడే: నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించే దేవీ నవరాత్రి వేడుకలకు రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లోని ప్రముఖ అమ్మవారి ఆలయాలు ముస్తాబు అవుతున్నాయి.

● సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం, సఖినేటిపల్లి తదితర గ్రామాల్లో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ ఆలయాల్లో దసరా ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. చలువ పందిళ్లు వేసి విద్యుత్తు అలంకరణలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఏసీ సత్యనారాయణ వెల్లడించారు.



పల్లిపాలెంలో విద్యుత్తు దీపాల అలంకరణలో..



అంబాజీపేట పశువులసంతలో విజయ కనకదుర్గమ్మ ఆలయం

● పి.గన్నవరం మండలం తాటికాయలవారిపాలెం, పి.గన్నవరం, జి.పెదపూడి, పప్పులవారిపాలెం, నరేంద్రపురం, ముంగండ, మానేపల్లి, నాగుల్లంక, వాడ్రేవుపల్లి, మొండెపులంక, బెల్లంపూడి, ఊడిమూడి తదితర గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాలను విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు.



తాటికాయలవారిపాలెం కనకదుర్గగుడి

● అంబాజీపేట పశువుల సంత, మాచవరం, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, ముక్కామల, చిరుతపూడి, నందంపూడి, వాకలగరువు గ్రామాల్లో ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఆత్రేయపురం: దసరా ఉత్సవాలు దగ్గర పడుతున్న తరుణంలో ఆత్రేయపురం మండలంలోని గ్రామాల్లో దేవీ ఆలయాలను తీర్చిదిద్దుతున్నారు. వాడపల్లి వేంకటేశ్వరుడి సోదరిగా కొలువుదీరిన విజయదుర్గాదేవి ఆలయంలో 3 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది ఏర్పాట్లు చేస్తున్నారు. బొబ్బర్లంక, పేరవరం, పులిదిండి, తాడిపూడి, కట్టుంగ, నార్కెడుమిల్లి, మెర్లపాలెం తదితర గ్రామాల్లో దేవీ మందిరాలు విద్యుద్దీపాలంకరణలో శోభిల్లుతున్నాయి.

విచారణ కమిటీ రాకుండా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

మలికిపురం, న్యూస్‌టుడే: ఏఎఫ్‌డీ ట్రస్టు విద్యాసంస్థల అవకతవకలపై ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నియమించిన విచారణ కమిటీ రాకుండా హైకోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినట్టు కరస్పాండెంట్ ఎం.వి.సత్యనారాయణ బుధవారం విలేకర్ల సమావేశంలో చెప్పారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ట్రస్టు ఆధ్వర్యంలోని విద్యాసంస్థల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయని, వాటిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని, పాలకవర్గాన్ని రద్దుచేసి ప్రత్యేక అధికారిని నియమించాలని కోరుతూ ఇటీవల ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఉన్నత విద్యామండలికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మండలి ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని నియమించింది. దీన్ని వ్యతిరేకిస్తూ పాలకవర్గం కోర్టుని ఆశ్రయించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినట్టు కరస్పాండెంట్ ఎం.వి.సత్యనారాయణ, కోశాధికారి జాన శంకర్రావు, సభ్యుడు రుద్రరాజు పద్మరాజు చెప్పారు.

నీటి పారుదలకు అడ్డంకులెన్నో..!



మామిడికుదురు నూకాలమ్మ ఆలయానికి సమీపంలో పంట కాలువ మధ్యలో ఉన్న మంచినీటి పైపు, ఇతర గొట్టాల్లో వ్యర్థాలు నిలిచిపోవడంతో నీటి పారుదలకు విఘాతం కలుగుతోంది. దీనిపై మూడు గ్రామాలకు చెందిన సుమారు 700 ఎకరాల వరకు ఆయకట్టు ఆధారపడి ఉంది. ఇక్కడ నిలిచిపోతున్న వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనతో తీవ్ర యాతనలు పడుతున్నట్లు స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయాన్ని గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటిపారుదలకు ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

- న్యూస్‌టుడే, మామిడికుదురు

అడుగేయాలంటే హడలే..

• ఆధునికీకరణ కరవైన స్లూయిస్‌లు

వైనతేయ, వశిష్ఠ నదీ తీరాల్లోని అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు శిథిల స్థితికి చేరి ఆందోళనకరంగా పరిణమిస్తున్నా ఆధునికీకరణ దిశగా చర్యలు లేకపోవడంతో తీర గ్రామాల్లో అలజడి రేగుతోంది. మధ్యతరహా కాలువల నుంచి మురుగు, ముంపు నీటిని నదిలోకి మళ్లించేందుకు ఏటిగట్టు మధ్యలో దాదాపు నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ కట్టడాల వద్ద ప్రమాదం పొంచి ఉంది. వాటిపై రాకపోకలు కూడా ఇబ్బందికరంగా మారడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. గత వైకాపా పాలనలో కొత్త స్లూయిస్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయడమే తప్ప నిధులు కేటాయించకపోవడంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

- న్యూస్‌టుడే, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి



ఆదుర్రులో స్లాబు విరిగి ప్రమాదకరంగా ఉన్న వాడబోది అవుట్‌ఫాల్ స్లూయిస్

రాజోలు నియోజకవర్గంలోని తీర గ్రామాల్లో ఉన్న నాలుగు అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు అధ్వానంగా మారాయి. 2007లో ఏటిగట్ల విస్తరణతో పాటు వీటి ఆధునికీకరణకు చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఆందోళన కలిగిస్తున్నాయి. ఇకనైనా నిధులు మంజూరు చేసి వాటికి మోక్షం కల్పించాలని స్థానిక గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

● మామిడికుదురు మండలం ఆదుర్రులో 210 హెక్టార్ల వరి చేలకు ఆధారమైన వాడబోది అవుట్‌ఫాల్ స్లూయిస్ గత నవంబరులో స్లాబు కొంతమేర విరిగింది. నెర్రలు తీసి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తుండటంతో రాకపోకలకు స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దీని ఆధునికీకరణకు రూ.4.16 కోట్లతో ప్రతిపాదనలు చేసి పంపడం తప్ప ఆమోదం కరవైంది.

● వాడబోది అవుట్‌ఫాల్ స్లూయిస్‌కు వంద మీటర్ల దూరంలో ఉన్న బచ్చులబంద స్లూయిస్ కూడా అధ్వానంగా మారడంతో రూ.2.45 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. దీనిపై దాదాపు 210 హెక్టార్ల పంటచేలు ఆధారపడి ఉన్నాయి. ఇరుగ్గా ఉన్న దీనిపై రాకపోకలకు అవస్థలు తప్పడంలేదు.

● 130 హెక్టార్ల వరిచేల నుంచి మురుగునీరు దిగాల్సిన గోగన్నమఠంలోని కడలి స్లూయిస్ దుర్భరంగా మారడంతో రూ.4.28 కోట్లతో కొత్త నిర్మాణం చేపట్టేందుకు గత ఏడాది ప్రతిపాదనలు చేసి పంపారు.



సుమారు 20 సంవత్సరాల క్రితం నిర్మితమైన మలికిపురం మండలం వేపచెట్టు మధ్యతరహా కాలువకు సంబంధించి పెదతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్‌కు ఉన్న ఆటోమేటిక్ తలుపులు సక్రమంగా పనిచేయక సుమారు 8 వేల ఎకరాల వరిచేలు ఏటా ముంపుబారిన పడుతున్నాయి.

● సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో ఉన్న రాళ్లకాలువ స్లూయిస్ శిథిలావస్థకు చేరడంతో అక్కడ కొత్త నిర్మాణానికి ప్రతిపాదనలు చేయడం మినహా ప్రయోజనం ఏమీ కనిపించలేదు. అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికర, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు, అంతర్వేదిపాలెం గ్రామాలకు చెందిన సుమారు 800 ఎకరాల వరిచేలకు ఇది ఆధారం.

ప్రతిపాదనలు పంపాం..

శిథిలమైన నాలుగు అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల ఆధునికీకరణకు రూపొందించిన ప్రతిపాదనలను ఆమోదానికి పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. స్లాబు విరిగిపోయిన వాడబోది స్లూయిస్‌పైకి ఎవరూ వెళ్లకుండా తాత్కాలికంగా కంచె ఏర్పాటు చేశాం.

- టీఎల్ఎన్ మూర్తి, ఏఈఈ, వశిష్ఠ హెడ్‌వర్క్స్, రాజోలు

గ్రామాల అభివృద్ధే అజెండా: బండారు




సత్యానందరావును సత్కరిస్తున్న గ్రామస్థులు

నార్కెడుమిల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే అజెండా అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండారును ఘనంగా సన్మానించారు. తొలుతగా భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మండల తెదేపా అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, నాయకులు కరుటూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి గ్రామసభ

కొత్తపేట: ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా పరిపాలన సాగిస్తున్నామని కొత్తపేట సర్పంచి భూసిజయలక్ష్మి అన్నారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతకు పిలుపునిచ్చారు. భూసిభాస్కరరావు, కాశీధనరాజు, బండిరాజు, పావని, కార్యదర్శి రామన్ పాల్గొన్నారు.

బాపూ.. సమస్యలు తీరేలా చూడు



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సమగ్రశిక్షా సిబ్బంది

మామిడికుదురు, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని కోరుతూ సమగ్రశిక్షా సిబ్బంది మామిడికుదురులో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రెండు నెలలుగా నిలిచిపోయిన వేతనాలు వెంటనే అందేలా చూడాలని, ఎంటీఎస్ అమలు చేయాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు.

మలికిపురం: జీతాల కోసం గత మూడు వారాలుగా ఆందోళన చేస్తున్న స్థానిక డిగ్రీ కళాశాల అధ్యాపకులు వినాయకుడి ఆలయ కూడలిలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి తమ నిరసన వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కె.తనూజ్

మలికిపురం, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా అండర్-14 పోటీల్లో గుడిమెళ్లంక ఉన్నత పాఠశాలకు చెందిన కె.తనూజ్ ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయుడు పి.సత్యవెంకటసుబ్బారావు బుధవారం తెలిపారు. నవంబరులో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు.

అంబాజీపేటలో తాచుపాము హల్‌చల్

అంబాజీపేట: అంబాజీపేటలోని వ్యాపారి అప్పన శ్యామ్ కొబ్బరి గోదాములో బుధవారం తాచుపాము ప్రవేశించి భయాందోళనకు గురిచేసింది. కార్మికులు భయంతో పరుగులు తీశారు. జంపన గణేష్‌వర్మ వచ్చి దాన్ని బంధించారు.

మద్యం సీసాలు స్వాధీనం

మామిడికుదురు: నగరంలో బుధవారం తన ఇంటివద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వానరాశి నరసింహారావును అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు. నిందితుడి నుంచి రూ.9,780 విలువైన 60 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముగ్గురి జూదరుల అరెస్టు

ఆత్రేయపురం: తాడిపూడి గ్రామ శివారులో బుధవారం జూదం ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశామని ఎస్సై రాము తెలిపారు. వారి నుంచి రూ.5200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహాత్ముని మాట.. స్ఫూర్తి బాట

మహాత్మాగాంధీ అహింసా సిద్ధాంతంతో దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చారని వక్తలు కొనియాడారు. ప్రజలకు స్వాతంత్ర్య ఫలాలు అందించారన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం వాడవాడలా ఆయనకు ఘన నివాళి అర్పించారు. ప్రతిఒక్కరూ ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ రాజోలు వినాయక ఆలయం కూడలిలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టరు పెద్దకాపు, చెల్లింగి అబ్బులు పాల్గొన్నారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు కూడలిలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కూటమి శ్రేణులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కొత్తపేట మండలం వాడపాలెంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు.



మలికిపురం కూడలిలో.. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తదితరుల నివాళి

● పి.గన్నవరం అక్విడక్టు వద్ద విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ తెదేపా కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పెంటపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పుల్లేటికుర్రులో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గిడ్డి

- న్యూస్‌టుడే, అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి, కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు, రావులపాలెం పట్టణం, మామిడికుదురు, మలికిపురం, రాజోలు

లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలి: సి.ఐ.

పి.గన్నవరం, న్యూస్‌టుడే: విద్యార్థుల లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలని.. దాని ప్రకారం ఫలితాలు వస్తాయని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు సూచించారు. దేన్నైనా సాధించగలమనే పట్టుదలతో చదవాలన్నారు. పి.గన్నవరంలోని గ్రేస్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటైన వెల్‌కం, ఫేర్‌వెల్ పార్టీల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎన్.శ్రీచరణ్, ప్రిన్సిపల్ పీవీఆర్ నాయుడు పాల్గొన్నారు.



పొదలాడలో పొట్టిశ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

పొట్టిశ్రీరాములు విగ్రహావిష్కరణ

రాజోలు, న్యూస్‌టుడే: పొదలాడ కూడలిలో ఏర్పాటు చేసిన పొట్టిశ్రీరాములు విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవీ జిల్లా గవర్నర్ కాళ్లకూరి ప్రవీణ్, ఉప గవర్నర్ యెండూరి రాఘవ, సర్పంచి కడలి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసవీక్లబ్ ప్రెసిడెంట్ వెత్సా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



అసంపూర్తి నిర్మాణం.. ఎన్నాళ్లకు పూర్తయ్యేను!

అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం భవన నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.90 లక్షలతో పనులు ప్రారంభించారు. కొంత వరకు పనులు చేపట్టారు. అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అయిదేళ్ల పాటు ఈ భవన నిర్మాణ పనులు కుంటిపడ్డాయి. దీనిపై తహసీల్దార్ జె.వెంకటేశ్వరిని వివరణ కోరగా ఇటీవల రూ.50 లక్షలతో భవన నిర్మాణం చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం అన్నారు. ఇప్పుడు ఉన్న తహసీల్దార్ కార్యాలయ భవనం ఎటూ సరిపోవటంలేదని వాపోయారు.

- న్యూస్‌టుడే, అంబాజీపేట



పురస్కారాలు అందిస్తున్న ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్యే ఆనందరావు

ఉత్తమ సేవలకు సత్కారం

ఆలమూరు న్యూస్‌టుడే: అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో బుధవారం స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమాలను నిర్వహించారు. మండలానికి చెందిన సంధిపూడి సర్పంచి తోటభవాని, పెదపళ్ల పంచాయతీ కార్యదర్శి వి.వేణి, పారిశుద్ధ్య కార్మికుడు సి.హెచ్.లాజర్‌కు ఎంపీ హరీష్ మాథుర్, స్థానిక ఎమ్మెల్యే ఆనందరావు చేతుల మీదుగా పురస్కారాలు అందించినట్లు వారు తెలిపారు.

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి మండలం మోరిపోడు గ్రామ సర్పంచి ముప్పర్తి అలివేలు గంగాత్రివేణికి స్వచ్ఛతా హీ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. అమలాపురంలో జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు అందజేశారు.

మామిడికుదురు: లూటుకుర్రు సర్పంచి అడబాల తాతకాపు, మగటపల్లి కార్యదర్శి కె.పట్టిలింగం పురస్కారాలను అందుకున్నారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం మండలంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ముగ్గురికి ప్రశంసా పత్రాలను అందించారు. బొబ్బర్లంక పంచాయతీ సర్పంచి నరాలశెట్టి సుబ్బలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కృష్ణమాచార్యులు, ఆత్రేయపురం గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది నాగ అప్పారావులకు బుధవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్యే ఆనందరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందించారు.

సమస్యలపై గళమెత్తిన ప్రజలు

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు, శివకోటి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు పలు సమస్యలపై గళమెత్తారు. తాగునీరు సక్రమంగా అందడం లేదని, రెండు రోజులకోసారి ఇచ్చే తాగునీరు కూడా తాగేందుకు పనికిరావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శివకోటి చిన్నయ్యగారిపాలెంలో రోడ్డు నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా కార్యరూపం దాల్చలేదన్నారు. రాజోలులో చెరువుగట్టుపై ఆక్రమణలు తొలగించాలని కోరారు. తహసీల్దారు ప్రసాద్, సర్పంచులు రేవు జ్యోతి, నక్కా రామారావు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..



శివకోటి మూడురోడ్ల కూడలి వద్ద జాతీయ రహదారి మధ్యలో గొయ్యి ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో వాహనాలు పడి తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై ఎన్.హెచ్. ఏఈ పురుషోత్తంను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా గొయ్యిని పూడ్చుతామన్నారు.

- న్యూస్‌టుడే, రాజోలు

తుప్పల్లో స్తంభం...కానరాని దీపం



మాచవరం పంచాయతీ కాలువగట్టు రోడ్డు చెంతన ఓ విద్యుత్తు స్తంభానికి తీగ మొక్కలు అల్లుకున్నాయి. ఇక్కడ విద్యుత్తు స్తంభం కనబడనంతగా ఇవి పెరిగిపోయాయి. దీంతో విద్యుత్తు వీధి దీపం కాంతి కూడా బయటకురాని పరిస్థితి. దీనిపై మండల విద్యుత్తుశాఖాధికారి ఎం.కవితను వివరణ కోరగా పరిశీలించి తుప్పలు తొలగిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, అంబాజీపేట

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

ఇసుక అక్రమ నిల్వలు

యానాం, న్యూస్‌టుడే: యానాం పరిసర ప్రాంతాల్లో ఇసుకకు డిమాండు నెలకొనడంతో అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. తాళ్లరేవు మండలం ఆరటికాయలంక ఇసుక ర్యాంపునకు చేరువలో ఉన్న కనకాలపేట లంక ప్రాంతంలో పలువురు అక్రమంగా ఇసుక నిల్వ చేసి లారీలలో బయటకు తరలిస్తున్నారు. పుష్కర ఘాట్ వద్ద రవాణాకు సిద్ధంగా ఉంచిన ఇసుక గుట్టను యానాం పోలీసులు పరిశీలించారు. ఈ విషయాన్ని పరిపాలనాధికారి ఆర్.మునిస్వామికి తెలియజేయడంతో డీటీ వెంకటేశ్వరరావుతో కలిసి వెళ్లి అక్రమ ర్యాంపును, ఇసుక ఎగుమతి, దిగుమతి స్థలాన్ని పరిశీలించారు.

అండర్-19 కరాటే విభాగంలో ప్రతిభ



అమలాపురం పట్టణం: ది అమలాపురం కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వేద సంహిత అండర్-19 కరాటే విభాగంలో ప్రతిభ చాటింది. రాష్ట్రస్థాయి పోటీల్లో రెండవ స్థానంలో నిలిచినట్లు డైరెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కళాశాల డైరెక్టర్లు రాంబాబు, నాయుడు, సతీష్‌లు సంహితకు అభినందనలు తెలిపారు.

మండల సమావేశం నేడు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ఉప్పలగుప్తం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని గురువారం మధ్యాహ్నం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఎం.ఎల్.ఎన్.మూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు.



నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల జీపీఎఫ్, ప్రమోషన్, బదిలీలు, సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. గడియారస్తంభం కూడలిలో యూటీఎఫ్ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టి తమ సమస్యలు పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: కేంద్రంలో భాజపా ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతోందని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. గడియారస్తంభం కూడలిలో పార్టీ నాయకులు మూతికి నల్ల రిబ్బన్లు కట్టుకుని మౌన దీక్ష చేసి మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి, అయితాబత్తుల సుభాషిణి, ముషిణి రామకృష్ణారావు, రవీంద్ర, షకీలా తదితరులు పాల్గొన్నారు.

చెత్త పన్ను తుడిచేశారు..!

- వైకాపా ప్రభుత్వంలో ముక్కుపిండి వసూలు
- రద్దు చేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటనతో ప్రజల హర్షం

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్, పట్టణం

వైకాపా పాలనలో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన చెత్తపన్ను నుంచి పట్టణ ప్రజలకు ఉపశమనం కలిగింది. దీనిని రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమలాపురం పట్టణ ప్రజలపై ఏడాదికి రూ.60 లక్షల భారం తప్పనుంది. గత ప్రభుత్వంలో ఈ పన్నును ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేశారు. తీవ్ర వ్యతిరేకత వచ్చినా వైకాపా పాలకులు లెక్క చేయ లేదు.

ఒక్కో వాహనానికి రూ.66వేలు

అమలాపురం పురపాలక సంఘం పరిధిలో చెత్త సేకరణకు 10 క్లాప్(క్లీన్ ఏపీ) వాహనాలు ఉన్నాయి. ఒక్కొక్క దానికి ప్రతి నెలా రూ.66వేల చొప్పున చెల్లిస్తున్నారు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న చెత్త పన్నును ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ బ్యాంకు ఖాతాకు జమచేసే వారు. ఈ వాహనాలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి ప్రతి నెలా సొమ్ము విడుదల చేసేవారు. అమలాపురం పురపాలక సంఘంలో నివాసాల నుంచి చెత్త సేకరిస్తున్న వాహనాలకు ప్రతి నెలా రూ. 5.83 లక్షలు విడుదల చేస్తున్నారు.



అమలాపురం పురపాలిక పరిధిలో చెత్త సేకరిస్తున్న సిబ్బంది

అమలాపురంలో పరిస్థితి..

పురపాలక వార్డులు	: 30
నివాసాలు	: 30 వేలు
జనాభా	: 60 వేలు
నెలకు చెత్తపన్ను లక్ష్యం	: రూ.5 లక్షలు
వసూలు	: రూ.4 లక్షలు
పేదల ప్రాంతాల్లో ఇంటికి	: రూ.60
వ్యాపార సముదాయాలకు	: రూ.110
కల్యాణ మండపాలకు..	: సీజన్‌ను బట్టి

భారం తప్పింది..



కూటమి ప్రభుత్వం రాకతో ప్రతి నెలా చెత్త పన్ను భారం తప్పింది. ఎన్నికల హామీలు అమలు చేసినందుకు చంద్రబాబు సర్కారుకు ధన్యవాదాలు. గతంలో అన్ని రకాల పన్నులను పెంచి పేదలపై భారం వేశారు. దీంతో దుర్భర జీవితం గడిపాం.

- సీహెచ్ పద్మ, కొంకాపల్లి

ఇబ్బందులు పడ్డాం..



గత ప్రభుత్వం పన్నులు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ మౌలిక వసతులు కల్పించడంలో చూపలేదు. పట్టణ ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో ప్రజలకు వసతులు సమకూరే అవకాశం ఉందని భావిస్తున్నాం.

- దుర్గావాణి, కూచిమంచివారి అగ్రహారం

ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తాం

పట్టణ ప్రజల నుంచి చెత్త పన్ను వసూలు నిలుపుదల చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను తక్షణం అమలు చేస్తాం. ఈ ప్రభుత్వం వచ్చాక చెత్త పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించ లేదు. వసూలు నామమాత్రంగానే ఉంది. సీఎం ప్రకటన నేపథ్యంలో పూర్తిగా నిలుపుదల చేస్తాం.

- రాజు, కమిషనర్, అమలాపురం పురపాలిక



మాట్లాడుతున్న సర్పంచి సుధాకర్

గ్రామాల అభివృద్ధికి చర్యలు

కాట్రేనికోన: గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మండల సర్పంచులు సమాఖ్య అధ్యక్షుడు గంటి సుధాకర్ పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఉప ఎంపీపీ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత చర్యలు చాలా అవసరమన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

చౌకధరల దుకాణాల్లో బియ్యం ఇవ్వాలి

యానాం, న్యూస్‌టుడే: దీపావళి నాటికి పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న చౌకధరల దుకాణాలు ప్రారంభించి ప్రజలకు బియ్యం పంపిణీ చేయకుంటే కాంగ్రెస్ కూటమి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతుందని మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణసామి బుధవారం పుదుచ్చేరిలో హెచ్చరించారు. శ్రీలంక ప్రభుత్వం అంతర్జాతీయ జలాలలో వేట సాగించే పుదుచ్చేరి, తమిళనాడు మత్స్యకారుల్ని పట్టుకుని ఖైదు చేస్తున్న విషయంలో విదేశాంగ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు.

దసరా ఉత్సవం.. దేవీ వైభవం



అమలాపురంలోని శ్రీదేవి అమ్మవారు ఆలయంలో విద్యుత్తు అలంకరణ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రుల మహోత్సవం సందర్భంగా పట్టణంలో అమ్మవారి ఆలయాల వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. విద్యుత్తు దీపాలతో ముస్తాబు చేశారు. పట్టణంలో ప్రసిద్ధిచెందిన శ్రీదేవిమార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారు, కల్వకొలనువీధి వేపచెట్టు అమ్మవారు, దుర్గాసెంటర్‌లో శ్రీదేవి, కొంకాపల్లి శ్రీకనకదుర్గ అమ్మవారు, శ్రీకామాక్షిపీఠం, శ్రీకన్యకాపరమేశ్వరి, శ్రీవైష్ణవిదేవి ఆలయాల వద్ద దశమి మహోత్సవాల నిర్వాహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయాల వద్ద విద్యుత్తుదీపాల అలంకరణ, సెట్టింగులు, ప్రత్యేక పూజలకు సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణాల్లో గురువారం కళశాలతో అభిషేకజలాల ఊరేగింపు యాత్ర, లలితా పారాయణం, కుంకుమపూజ, అన్నసమారాధనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు.



దుర్గా సెంటర్‌లో..



ఆలయం బయట..

స్వచ్ఛత సేవలకు సన్మానం

అమలాపురం పట్టణం: చెత్తను వేర్వేరుగా డబ్బాలలో వేయాలని జేసీ నిశాంతి పేర్కొన్నారు. అమలాపురంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ రాజు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ, లాల్‌బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉత్తమ సేవలందించిన 15 మంది పారిశుద్ధ్యకార్మికులను సన్మానించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న గోడి సర్పంచి శ్రీదేవి దంపతులు

అమలాపురం గ్రామీణం: సమనస పంచాయతీ సర్పంచి పరమట శ్యామ్‌కుమార్ అధ్యక్షతన మహాత్మాగాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులను మాజీ ఎంపీపీ యెరుబండి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి నడింపల్లి ఉదయబాబు, నాయకులు సత్కరించారు. పేరూరు, కామనగరువు పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచులు దాసరి అరుణ, నక్కా అరుణకుమారి అధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు.

స్వచ్ఛ పంచాయతీగా గోడి

అల్లవరం: గోడికి స్వచ్ఛ గ్రామ పంచాయతీగా అవార్డు దక్కింది. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా 15 రోజులుగా నిర్వహించిన కార్యక్రమాల ఆధారంగా గాంధీ జయంతి రోజున పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీలు, కార్యదర్శులకు అవార్డులు అందజేశారు. సర్పంచి శ్రీదేవి కలెక్టరేట్‌లో జేసీ నిశాంతి నుంచి అవార్డు స్వీకరించారు.



సమనసలో సత్కరిస్తున్న మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు



అమలాపురంలో జేసీ నిశాంతి

మహాత్మా.. నీ బాటలో మేము సైతం



కలెక్టరేట్‌లో ఎంపీ హరీష్, ఎమ్మెల్యే ఆనందరావు, ఏఎస్పీ ప్రసాద్



యానాంలో నివాళి అర్పిస్తున్న అధికారులు, ప్రముఖులు

న్యూస్‌టుడే బృందం

జాతిపిత మహాత్మా గాంధీ చూపిన బాట అందరికీ అనుసరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం బాపూజీ జయంతిని వాడవాడలా నిర్వహించి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన బోధనలు అనుసరిస్తామని పేర్కొన్నారు.

● మహాత్మా గాంధీజీ బోధించిన అంశాలు, చూపిన అహింసా మార్గం నేటి తరానికే కాకుండా భవిష్యత్తు తరాల వారికి కూడా ఆచరణీయమని కోనసీమ జిల్లా జేసీ నిశాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.

● మహాత్మాగాంధీ ప్రబోధించిన సత్యం, అహింసా మార్గంలో నడవడం ద్వారా సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. గాంధీజీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జయంతిని అమలాపురం పట్టణంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ నాయకులు, అధికారులు బుధవారం నిర్వహించారు. పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్లు నివాళి అర్పించారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్యసంఘం నాయకులు మండపం వద్ద, భాజపా, జనసేన పార్టీ, వైకాపా పార్టీ, కాంగ్రెస్ నాయకులు, ది.అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యులు గడియారస్తంభం కూడలిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ కమలకుమారి



ముమ్మిడివరంలో తెదేపా, జనసేన, ఆర్యవైశ్య సంఘం నాయకులు

● మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి, పుదుచ్చేరి మాజీ స్పీకరు కామిశెట్టి పరశురామ వరప్రసాద రావు నాయుడు జయంతి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కామరాజనాడార్ వర్ధంతిని యానాంలో నిర్వహించారు. పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, కమిషనర్ రామకృష్ణ తదితర పాల్గొన్నారు.



గడియారస్తంభం కూడలిలో వైశ్యసంఘ నాయకులు



చల్లపల్లిలో గాంధీ విగ్రహం వద్ద నాయకులు

● ముమ్మిడివరం ఎయిమ్స్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మహాత్ముడి చిత్రపటానికి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రోంగ్రా కోఆర్డినేటర్ ఎం.మధుసూధనరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైకాపా కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ నివాళులర్పించారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్ నివాళులర్పించారు.

మద్యం పాలసీని రద్దు చేయాలి



గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని రద్దు చేయాలని ఐద్వా మహిళలు డిమాండ్ చేశారు. గడియారస్తంభం కూడలిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఐద్వా మహిళలు బుధవారం నిరసన తెలిపారు. ఎండీ హమీద్ ఉనిషా, టి.నాగవరలక్ష్మి, ఆర్ సుశీల, సత్యదేవి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలి.. అమలాపురం పట్టణం: గతంలో పనిచేసిన వాలంటీర్లు ఉపాధి లేక నాలుగు నెలలుగా ఇబ్బందులు పడుతున్నారని ప్రజా సంఘా నాయకుడు కె.సత్తిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గడియారస్తంభం కూడలిలో గాంధీ విగ్రహం వద్ద వాలంటీర్లు బుధవారం నిరసన తెలిపారు. న్యాయం చేయాలంటూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

వసతి గృహంలో యువకుడిపై దాడి

అమలాపురం పట్టణం: కాట్రేనికోన మండలానికి చెందిన చిల్లే మధుపై మద్దాలవారి పేటలో కొందరు యువకులు బుధవారం రాత్రి దాడి చేశారు. సాంఘిక సంక్షేమశాఖ ప్రభుత్వ కళాశాల వసతి గృహంలోకి వెళ్లి ఇంటర్ చదువుతున్న మధు, అతడి మిత్రులపై దాడి చేశారు. అడ్డువచ్చిన సిబ్బందిపై తిరగబడ్డారు.

నిందితులను శిక్షించాలి..

అమలాపురం పట్టణం: చిల్లే మధుపై మాజీ మంత్రి విశ్వరూప్ అనుచరులు హాస్టల్‌లో ప్రవేశించి దాడి చేశారని బీఎస్పీ నియోజకవర్గ ఇంఛార్జ్ మోహన్‌బాబు ఆరోపించారు. మద్దాలవారిపేటలోని సాంఘిక సంక్షేమశాఖ ప్రభుత్వ కళాశాల వసతిగృహంలో ఇంటర్ చదువుచున్న మధును పదిమంది యువకులు కొట్టారన్నారు. కలెక్టర్ స్పందించి నిందితులను అరెస్టు చేయాలని కోరారు.

మద్యం విక్రయిస్తున్న ఒకరి అరెస్టు

కాట్రేనికోన: కాట్రేనికోనలోని ఉప్పుకాలువ వంతెన సమీపంలో పాన్‌షాపులో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో బుధవారం దాడిచేసి నడవపల్లికి చెందిన కాశి ఊరిళా చక్రధరరావును అరెస్టుచేశారు. అతడు ఓ సామాజిక మాధ్యమంలో విలేకరిగా పనిచేస్తున్నట్లు ఎస్సై అవినాష్ తెలిపారు. అతని నుంచి 9 యానాం మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: చట్టాల పట్ల అవగాహన పెంచుకోవడం ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని ముమ్మిడివరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ అన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా సీహెచ్ గున్నేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు సత్యనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడారు. సర్పంచి గొలకోటి దొరబాబు, యాళ్ల ఉదయ్, గాలిదేవర మూర్తి, గొలకోటి సాయిబాబు, గుత్తుల



సదస్సులో మాట్లాడుతున్న సత్యనారాయణ

మాజీ మంత్రి పుట్టిన రోజు వేడుకలు

ముమ్మిడివరం: మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ పుట్టినరోజు వేడుకలు ముమ్మిడివరంలోని వైకాపా కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. పితాని బాలకృష్ణ, కమిడి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం పట్టణం: విశ్వరూప్ పుట్టినరోజు వేడుకలను వైకాపా పట్టణ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు.

పూర్తిస్థాయిలో ఉపాధిహామీ పనులు

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో అందరికీ పనులు కల్పించడంతో పాటు రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పి.గన్నవరం ఏపీడీ మల్లిఖార్జునరావు అన్నారు. మండలంలోని గోపాలపురంలో జరిగిన ఉపాధిహామీ గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ప్రారంభోత్సవానికి సమాచారం ఇవ్వరా..?

అల్లవరం: బెండమూర్లంక పంచాయతీ పరిధిలో నిర్మించిన సంపద కేంద్రాన్ని తమకు సమాచారం ఇవ్వకుండా ప్రారంభోత్సవం చేశారని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని కూటమి నాయకులు పేర్కొన్నారు. ఇక్కడి సంపద కేంద్రాన్ని బుధవారం గాంధీజీ జయంతి సందర్భంగా సర్పంచి బర్రే సీతారత్నం, కార్యదర్శి చిక్కం శ్రీనివాస్, ఇతర వైకాపా నాయకులతో కలిసి ప్రారంభించారన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీ మృతి

శంషాబాద్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీ మృతి చెందిన ఘటన శంషాబాద్ మున్సిపల్ పరిధి సాతంరాయి బస్టాప్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఆర్జీఐఏ పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లావరం వాసి సత్యనారాయణ(58) ఉపాధి కోసం కొంతకాలం క్రితం శంషాబాద్ వచ్చాడు. తాపీ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. సాతంరాయిలోని బంధువుల వద్దకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో జాతీయ రహదారిని దాటుతుండగా శంషాబాద్ నుంచి వేగంగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని ఉస్మానియా ఆసపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

జనసేన దీక్షకు భాజపా మద్దతు



జనసేన దీక్ష వద్ద సోము వీర్రాజు, భాజపా నాయకులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వం తీసుకుని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని బలపరచాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు కోరారు. అమలాపురంలోని భాజపా జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గడియారస్తంభం కూడలిలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. అనంతరం ఆ ప్రాంగణంలో జనసేన నాయకులు చేపట్టిన స్వామి క్షమించు.. దోషులను శిక్షించు కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. నాయీబ్రాహ్మణుల ఆధ్వర్యంలో లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మోకా సుబ్బారావు, ఆర్వీ నాయుడు, దూరి రాజేష్ అడపా శ్రీను, చిట్టూరి రాజేశ్వరి, సుంకర సాయి తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల ఆవిష్కరణ

అల్లవరం: కొమరగిరి పట్నం పరిధిలో మహాత్మ గాంధీజీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను బుధవారం ఆవిష్కరించారు. మోటమర్రి వెంకటరమణ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కె.వెంకట్రావు ఆవిష్కరించారు. జిల్లా భాజపా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, నాయకులు పాల్గొన్నారు.



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీకి తాతాజీ రాజీనామా

అమలాపురం పట్టణం: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్లు కల్వకొలను తాతాజీ బుధవారం తెలిపారు. 1983 నుంచి పార్టీకు ఎన్నో సేవలు అందించానన్నారు. త్వరలో జనసేనలో చేరుతున్నట్లు ఆయన చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

ట్యాంకు కడిగించారు

సమస్య: కాట్రేనికోనలోని సత్తెమ్మచెట్టులో తాగు నీటి ట్యాంకులోపల నాచు ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకును శుభ్రం చేయాలి. – స్థానికులు

పరిష్కారం: ఈ సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. తమ సిబ్బందితో ట్యాంకును బ్లీచింగ్‌తో కడిగించారు.

వీధి దీపాలకు మరమ్మతులు

సమస్య: దొంతికుర్రు పంచాయతీ పరిధి మర్లచెరువులో కొన్ని వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. – గ్రామస్థులు

పరిష్కారం: పంచాయతీ సర్పంచి ఈశ్వరికి తెలుపగా స్పందించారు. సిబ్బందితో వీధిదీపాలకు మరమ్మతులు చేయించారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

మండపేట
• మండపేట • రామచంద్రపురం

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక


జస్వంత్‌ను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

రామచంద్రపురం: పట్టణంలోని చింతపల్లి సూరన్న నగర్ ఇందిరాగాంధీ మున్సిపల్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న మేడిశెట్టి జస్వంత్ అండర్-17 రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్.ఎం మాధవ తెలిపారు. కాకినాడ క్రీడా మైదానంలో సోమవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీల్లో తలపడి ప్రతిభ కనబరిచాడన్నారు. జస్వంత్‌ను, పీఈటీ నాగార్జునను ఎంఈవో శ్రీనివాస్, పాఠశాల కమిటీ సభ్యులు గుబ్బల సత్యనారాయణ అభినందించారు.

కనకదుర్గమ్మవారికి రథం

రామచంద్రపురం: రామచంద్రపురం శివాలయం పార్కువద్ద గల కనకదుర్గమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన వ్యాపారి నేరెళ్ల గోపీ త్రినాథ్ కుటుంబ సభ్యులు రూ.1.5లక్షలు విలువచేసే టేకు రథాన్ని ఇనుప బ్రేకులతో సహా తయారు చేయించారు. ప్రతి ఏటా దసరా మహోత్సవాల ప్రారంభోత్సవ రోజున అమ్మవారిని ఊరేగిస్తారు. ఈ ఊరేగింపునకు ఉపయోగపడేలా రథాన్ని తయారు చేయించి ఆలయానికి ఇస్తున్నట్లు దాత పేర్కొన్నారు.


తయారు చేయించిన రథం వద్ద దాత నేరెళ్ల గోపీ త్రినాథ్ స్వామి


కృత్తివెంటి ప్రభుత్వ విద్యాసంస్థల ప్రాంగణంలో


రామచంద్రపురంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట


నెలపర్తిపాడులో సత్కారం

బాపూజీ బాటలో నడుద్దాం

రామచంద్రపురం: జాతిపిత మహాత్మా గాంధీ అడుగు జాడల్లో నేటి యువత నడవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీదేవి అన్నారు. బుధవారం గాంధీ జయంతి పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కమిషనర్ బి. శ్రీనివాసులు పాల్గొన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ విద్యాసంస్థల ప్రాంగణంలో గాంధీజీ విగ్రహానికి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలేసి నివాళులర్పించారు. పాతబస్టాండ్ సెంటర్ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో గాంధీజీ వేడుకలు జరిగాయి. అధ్యక్షకార్యదర్శులు పట్నాల సత్యనారాయణ, రామకృష్ణారావు, కాంట్రాక్ట్ బెస్ట్ స్పోర్టింగ్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు జీతాలు సత్వరం చెల్లించాలని తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

● **ద్వారపూడి:** మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ద్వారపూడి, కేశవరం, జడ్.మేడపాడులో బుధవారం ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజారోగ్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంపీపీ వాసు, సర్పంచులు చంద్రశేఖర్, సత్యనారాయణమూర్తి, ఉప సర్పంచి శేషారావు, ఎంపీడీవో సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

● **ద్రాక్షారామ:** హసనబాదలో సర్పంచి సతీష్‌రావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు హాజరయ్యారు. తాళ్లపొలం, నెలపర్తిపాడు, ద్రాక్షారామ, వెలంపాలెం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచులు సఫాయిమిత్రలను సత్కరించారు.

● **రాయవరం:** ఎంపీడీవో కొప్పుల నరేంద్రరెడ్డి అధ్యక్షతన మండల పరిషత్తు కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి జడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, సర్పంచి చంద్రమళ్ల రామకృష్ణ, కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుర్మాపురంలో సంపద తయారీ కేంద్రం వద్ద జరిగిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. రాయవరం, లొల్ల, నదురుబాద, వి.సావరం, వెదురుపాక, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు,వెంటూరు, కురకాల్లపల్లి పంచాయతీ కార్యాలయాల్లో పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు.

అంగర: కపిలేశ్వరపురం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ సత్యవేణి, ఎంపీడీవో కొండలరావు, తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంగర, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, కేదార్లంక, కాలేరు, టేకి, తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

పామర్రు: పామర్రు, కె.గంగవరం, కోటిపల్లి పంచాయతీ కార్యాలయాల వద్ద గాంధీవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భాజపా నాయకులు రమణమూర్తి, జి.సత్యనారాయణ, సత్యనారాయణ, క్షత్రియ చిట్టిబాబు, గ్రామపెద్ద వాసంశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

మండపేట గ్రామీణం: గాంధీ, శాస్త్రి జయంతిని మండపేట పట్టణం, రూరల్ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వారి విగ్రహాలకు మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అఖిలభారత కాంగ్రెస్ పార్టీ సభ్యులు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.


కూర్మాపురంలో...


మండపేటలో...


కపిలేశ్వరపురంలో...

ఉద్యానాల అభివృద్ధి ఎప్పుడో..!

న్యూస్‌టుడే, రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలో పలు ఉద్యానాలు అభివృద్ధికి నోచుకోక పట్టణ ప్రజలు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో వీటిని పూర్తిగా పట్టించుకోని కారణంగా ప్రజలకు పార్కులు వినియోగించుకునే అవకాశం లేదు. సాయంత్రం, సెలవు దినాల్లో కాసేపు సేద తీరదామంటే సౌకర్యాలు లేక ఇళ్లలోనే మగ్గుతున్నారు. పట్టణంలో 28 వార్డులు 12 వార్డు సచివాలయాల పరిధిలో 46 వేల జనాభా ఉన్నారు. బ్రాడీపేట, శివాలయం వీధి, అఫీషియల్ కాలనీ, రత్నంపేటలో పార్కులుండేవి. వాటి అభివృద్ధి పూర్తిగా మరిచారు. సామగ్రి పాడైతే తిరిగి కొనుగోలు చేయలేకపోయారు. లలితానగర్, కె.ఎస్.ఆర్ నగర్‌లలో పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. వాటిని పట్టించుకోలేదు.

నాలుగు పార్కుల పరిస్థితి ఇలా...

పట్టణంలో ఒక్క బ్రాడీపేటలో ఉన్న విజయదేవి పురపాలక పార్కులో ఐదేళ్ల పిల్లల సామగ్రిని కొనుగోలుచేసి వాటిని ఏర్పాటు చేయడంతో ఆ ఒక్క పార్కులోనే పిల్లలు కళకళలాడుతున్నారు. ఇక వారి త్యాగరాజ నగర్‌లో నెలకొల్పిన సత్యనారాయణ పురపాలక పార్కు(శివాలయం పార్కు)లో గతంలో ఆటవస్తువులుండేవి. ఎక్కువ మంది పిల్లలు, నిరుద్యోగ యువత ఇలా ఎంతో మంది ఈ పార్కులోనే సేద తీరేవారు. అయితే ఈ ఉద్యానవన అభివృద్ధి చేద్దామన్న ఊసేలేకుండా పోయింది. పిల్లల ఆటవస్తువులు ఏర్పాటు చేస్తే బ్రాడీపేట పార్కు కన్నా ఎక్కువమంది శివాలయం పార్కుకు వస్తారని చెబుతున్నారు. 13వ వార్డు అఫీషియల్ కాలనీలో పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పి ప్రహరీ నిర్మించి వదిలేశారు. ఇక రత్నంపేటలో ఉన్న చిన్న పార్కు, పిల్లల పార్కుగా అభివృద్ధి చేస్తామని మాటలకే ఏళ్ల తరబడి పరిమితమవుతుంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పార్కులకు పూర్వ వైభవంగా తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


నిరుపయోగంగా అఫీషియల్ కాలనీ పార్కు


బ్రాడీపేట పార్కులో ఆడుకుంటున్న విద్యార్థులు

ప్రతిపాదనలు పంపించాం

రామచంద్రపురం పట్టణంలో మున్సిపల్ పార్కులను త్వరలోనే అభివృద్ధి చేస్తాం. పార్కుల అభివృద్ధికి పెద్దల యోగా చేసుకునేందుకు, శివాలయం పార్కులో స్విమ్మింగ్ పూల్ తదితర ఏర్పాట్లకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే అనుమతులు వస్తే బ్రాడీపేట పార్కులాగానే మిగిలిన ఉద్యానవనాల్లో పిల్లలు కళకళలాడేలా చర్యలు తీసుకుంటాం.

- బి.శ్రీనివాసులు, పురపాలక కమిషనర్, రామచంద్రపురం

శరన్నవరాత్రి వేడుకలకు ముస్తాబు

రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణంలో దసరా మహోత్సవ వేడుకలకు ఆయా ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రధాన రోడ్డులో జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం వద్ద, శివాలయం పార్కువద్ద కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం ఎదుట రోడ్డు పొడవునా, కొత్తూరు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం ముందు ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి.

అంగర: శరన్నవరాత్రి ఉత్సవాల కోసం కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. అంగర, కాలేరు, వల్లూరు, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తదితర గ్రామాల్లో అమ్మవారిని నెలకొల్పడానికి మండపాలు ఏర్పాటు చేశారు. కపిలేశ్వరపురం దేవీ సెంటరు వద్ద చలువ పందిళ్లు నిర్మించి, వీధులన్నీ విద్యుత్తు దీపాలతో అలంకరించారు.


రామచంద్రపురం శివాలయం పార్కు వద్ద కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం


ప్రత్యేక అలంకరణలో జ్ఞాన సరస్వతి అమ్మవారు


కపిలేశ్వరపురం దేవీ సెంటరులో విద్యుద్దీపాలంకరణ

కనకదుర్గమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

మండపేట గ్రామీణం: విజయవాడ కనకదుర్గమ్మవారిని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.


మందులు పంపిణీ చేస్తున్న జేడీ వెంకటేశ్వరరావు

పశుపోషణ లాభసాటిగా మార్చుకోవాలి

రాయవరం, న్యూస్‌టుడే: పశుపోషణ లాభ సాటిగా మార్చుకొనే పద్ధతులపై పశుపోషకులు అవగాహన పెంపొందించుకోవాలని పశుసంవర్ధకశాఖ జేడీ డా.ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పసలపూడిలో ఎస్సీ ఉపప్రణాళిక నిధులతో ఏర్పాటు చేసిన పశువైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. సర్పంచి కడలి పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉప సంచాలకులు డా.నాగేశ్వరరావు, సహాయ సంచాలకులు డా. ఓ.రామకృష్ణ, డా.వి.జి.యస్.వరప్రసాద్ మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు, పోషణలో మెలకువలు వివరించారు. 50 పశువులను పరీక్షించి, రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి పి.విజయ్, డా. ఎ.నాగశ్రావణి పాల్గొన్నారు.

మలుపులో జాగ్రత్త

రాయవరం, న్యూస్‌టుడే: మండలంలోని సోమేశ్వరం-రాజానగరం ప్రధాన రహదారిలో మలుపుల వద్ద హెచ్చరిక సూచికలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సోమేశ్వరం శివాలయం, కమ్మవారి రామాలయం, రాయవరంలోని పెట్రోల్ బంక్‌ల వద్ద మలుపులతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమేశ్వరం వంతెన కూడలి నుంచి ఎస్.ఆర్.రహదారిలోనే రామచంద్రపురం, రాయవరం, కె.గంగవరం మండలాల నుంచి బూరుగుపూడి విమానాశ్రయానికి రాకపోకలు సాగిస్తుంటారు. రహదారిలో హెచ్చరిక సూచికలేవీ లేకపోవడంతో చోదకులు మలుపులను గుర్తించేలోగానే ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై రామచంద్రపురం ర.భ. శాఖ డీఈఈ సూర్యనారాయణరావును వివరణ కోరగా వార్షిక నిధులు మంజూరు కాగానే హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయిస్తామన్నారు.


సోమేశ్వరం రామాలయం వద్ద హెచ్చరిక సూచికలు లేని ప్రమాదకర మలుపు


ద్వారపూడిలో పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం


రామచంద్రపురం మండల బృందం


కె.గంగవరం మండలానికి చెందిన వారికి...

ఉత్తమ సేవకులకు సన్మానం

ద్రాక్షారామ, పామర్రు: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో ఉత్తమ సేవలు అందించిన వారిని బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో సత్కరించారు. రామచంద్రపురం మండలానికి ఉండూరు సర్పంచి చిగురుపాటి రామలక్ష్మిని ఉత్తమ సర్పంచిగా, ద్రాక్షారామ పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యంను ఉత్తమ కార్యదర్శిగా, ఉత్తమ సఫాయిమిత్రగా వెల్లకు చెందిన నాగేశ్వరరావును ఎంపికచేశారు. వీరిని జేసీ ● కె.గంగవరం మండలం నుంచి దంగేరు సర్పంచి వెంకటరమణ, ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా వి.గౌరీశంకర్, ఉత్తమ సఫాయిమిత్రగా పలివెల తాతారావును ఎంపీ హరీష్‌మాధుర్ సత్కరించారు.

ద్వారపూడి. జడ్.మేడపాడు సర్పంచి కంచర్ల చంద్రశేఖర్ ఉత్తమ పంచాయతీ సర్పంచిగా అవార్డు అందుకున్నారు. అమలాపురంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి రాంబాబు ప్రశంసాపత్రం అందించారు.

మండపేట గ్రామీణం: పారిశుద్య నిర్వహణలో మండపేట పురపాలక సంఘం అత్యున్నత స్థానంలో నిలిచిందని మున్సిపల్ కమిషనర్ రంగారావు పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవా ముగింపు కార్యక్రమం ఘనంగా పురపాలక సంఘ భవనం వద్ద జరిగింది. మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులను సత్కారం..

గ్రామ సింహాలు వెంటాడుతున్నాయ్

రాయవరం, న్యూస్‌టుడే: మండలంలో గ్రామాల్లో వీధికుక్కల సమస్య తీవ్రంగా మారింది. రాయవరం, వెదురుపాక, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు తదితర గ్రామాల్లో రహదారులపై వెళ్లే పాదచారులు, వాహనచోదకులను గ్రామసింహాలు వెంటాడి దాడులకు తెగబడుతున్నాయి. సాయంత్రం సమయాల్లో చిన్నారులు, వృద్ధులు వీధుల్లో తిరిగేందుకు భయపడుతున్నారు. వారపు సంతలు, ప్రధాన రహదారుల వెంట నిర్వహిస్తున్న మాంసం దుకాణాల వ్యర్థపదార్థాల వద్ద వీధి కుక్కలు మోహరిస్తున్నాయి. వీటి నియంత్రణకు గ్రామపంచాయతీలు చర్యలేమీ తీసుకోకపోవడంతో సమస్య జటిలంగా మారుతోంది. గ్రామసింహాలను నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, చర్యలు తీసుకుంటామన్నారు.


రాయవరం కచేరి చావిడి వీధిలో గుంపులుగా గ్రామసింహాలు

కోటిమొక్కల మహాయజ్ఞం


వైద్యునికి మొక్కలు ఇస్తున్న వాసవిక్లబ్ సభ్యులు

మండపేట: కోటి మొక్కలను అక్టోబరు 2న నాటాలని వాసవి ఇంటర్నేషనల్ పిలుపు నిచ్చింది. ఈ కార్యక్రమంలో భాగంగా మండపేట వాసవిక్లబ్ సభ్యులు 10వేల విత్తనాలు బాల్స్ రూపంలో తయారు చేసి రహదారులు, నిర్జిన ప్రదేశాలు, అటవీ ప్రదేశాలు, కొండప్రాంతాల్లో ఈ ఒక్కరోజు నాటినట్లు క్లబ్ అధ్యక్షురాలు కాళ్లకూరి శాంతి తెలిపారు. కోటిమొక్కల మహాయజ్ఞానికి పిలుపునిచ్చి, మొక్కలు నాటడం పూర్తిచేసిన వాసవి ఇంటర్నేషనల్ క్లబ్‌కు ఎలైట్ బుక్ఆఫ్‌వరల్డ్ రికార్డులో స్థానం పొందినట్లు ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బోడా వీర్రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బోనగిరి రమణి, కోశాధికారి పెరుమాళ్ల మహాలక్ష్మి, సభ్యులు వాకచర్ల వాసంతి, పెరుమాళ్ల రామలక్ష్మి పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం ఎప్పుడో..!

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ వింతగా ఉంటుంది. ఊరికి నడిబొడ్డున సప్తగోదావరి నదికి చెంతన డంపింగ్ యార్డు ఎన్నో ఏళ్లుగా ఉంటోంది. ఇది చాలా కాలం క్రితమే నిండినా ఇప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించకుండా దీనినే కొనసాగిస్తున్నారు. దీనివల్ల రూ.లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. నిండి పోయిన డంపింగ్ యార్డును ఖాళీ చేసే ప్రక్రియ చేపట్టాలి. లేదా ప్రత్యామ్నాంగా ఊరికి చివర్లో వేరే చోట యార్డును ఏర్పాటు చేయాలి. కానీ అదేమీ చేయకుండా వర్షాలు పడేటప్పుడు చెత్తను తీసుకొచ్చి రోడ్లపై డంప్ చేస్తున్నారు. ఈ సమస్యపై పత్రికల్లో కథనాలు వెలువడ్డాక జేసీబీతో అదే చెత్తను ఎత్తించి మళ్లీ డంపింగ్ యార్డులోకి తోలుతున్నారు. దీనివల్ల రెండుమూడు నెలలకు ఒకసారి జేసీబీ, ట్రాక్టర్లకు చాలా ప్రజాధనం వెచ్చించాల్సి వస్తోంది. దీనికి శాశ్వత పరిష్కారాన్ని అన్వేషించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


జేసీబీతో చెత్త తొలగింపు

బాలికను వేధించిన వ్యక్తిపై పోక్సో కేసు

రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణ హౌసింగ్ బోర్డుకు చెందిన జుత్తుక స్వాతి కిరణ్ అనే వ్యక్తి బాలికను వేధిం వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రపురంలో కంప్యూటర్ కోచింగ్ తీసుకుంటున్న బాలిక(17)ను ప్రేమిస్తున్నానంటూ వెంటపడి గత నెల 30న కంప్యూటర్ సెంటర్ నుంచి స్వాతి కిరణ్ అపహరించాడంటూ ఫిర్యాదు చేశారు. ఈమేరకు జుత్తుక స్వాతి కిరణ్‌ను ఎస్.ఐ అరెస్టు చేశారు. అతనిని కోర్టులో హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. బాలిక ఇష్టపడినా తల్లిదండ్రులు కేసు పెడితే వెంటనే పోక్సో కేసు నమోదు చేస్తామని, ఈ విషయాన్ని అబ్బాయిల తల్లిదండ్రులు గమనించాలని సీఐ సూచించారు.


విద్యుత్తు ఉద్యోగులతో ప్రమాణం చేయిస్తున్న ఎస్ఈ రాజబాబు

విద్యుత్తు భద్రతపై ప్రతిజ్ఞ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణంలో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో విద్యుత్తు శాఖ ఎస్ఈ రాజబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్తు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఏపీ ఈపీడీసీఎల్ విద్యుత్తు శాఖ సిబ్బందితో భద్రత పట్ల అప్రమత్తంగా ఉంటామని విద్యుత్తు లైన్ల కింద ఎటువంటి నిర్మాణాలు చేయరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ కె.రత్నాలరావు, డీఈఈ కంచి మూర్తి మురళీమోహన్ ఏఈ వెంకటరమణ, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట: మండపేటలో విద్యుత్తు వారోత్సవాలను విద్యుత్తు అధికారులు బుధవారం నిర్వహించారు. డీఈ శ్రీధర్ ప్రజలకు అవగాహన కల్పించారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం

రామచంద్రపురం: రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు బదిలీపై వెళ్తుండటంతో బుధవారం సన్మానించారు. పట్టణ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ ఛైర్మన్లు శివాజీ, నాగేశ్వరరావు, కౌన్సిలర్లు సాయి ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది తదితరులు బుధవారం సాయంత్రం వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఇతర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చకుంటే ఇక్కట్లే

రాయవరం, న్యూస్‌టుడే: మండలంలో సోమేశ్వరం వంతెన కూడలి నుంచి రామచంద్రపురం వెళ్లే ప్రధాన కెనాల్ రహదారి అధ్వానంగా మారింది. సుమారు అయిదు కిలోమీటర్ల మేర రహదారి ప్రయాణంలో గుంతలను తప్పించుకుంటూ ప్రయాణం చేయడం సాహసంగా మారింది. రాత్రి సమయాల్లో గుంతలను తప్పించే క్రమంలో వాహనాలు నిలిచిపోతుండటంతో ట్రాఫిక్ నిలిచి.. వాహనాలు బారులు తీరుతున్నాయి. రహదారిలో గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని వాహన చోదకులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రామచంద్రపురం డీఈ సూర్యనారాయణరావు మాట్లాడుతూ తాత్కాలిక మరమ్మతులకు అంచనాలను రూపొందించామన్నారు. నిధులు మంజూరుకాగానే యుద్ధప్రాతిపదికన గుంతలను పూడ్చుతామన్నారు.


పసలపూడి-మాచవరం కెనాల్ రహదారిలో ప్రమాదకరంగా గుంతలు ఇలా..

నిర్మించినా నిరుపయోగం

కపిలేశ్వరపురం మండలం వాకతిప్ప పీహెచ్‌సీ పరిధిలోని మాచరలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని స్థానిక పాల సేకరణ కేంద్రంలో నిర్వహిస్తున్నారు. దీంతో అక్కడికి వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో స్థానికంగా ఆసుపత్రులు లేని గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పేరుతో నిర్మాణాలు చేపట్టారు. మాచరలో రూ. 17.50 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనాన్ని నిరుపయోగంగా ఉంచేశారు. నిధులు సరిపడకపోవడం వల్ల విద్యుత్తు సరఫరా ఏర్పాటు చేయలేదు. గత మార్చిలో హడావుడిగా ప్రారంభించినా ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా పరిశీలించి, త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడతామన్నారు.


మాచరలో విద్యుత్తు సరఫరా లేని భవనం

– న్యూస్‌టుడే, అంగర

తొలగించకుంటే ప్రమాదమే

మండపేట పట్టణం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధిలో విద్యుత్తు స్తంభానికి పచ్చని పొదులు అల్లుకున్నాయి. అవి తీగలను సైతం తాకుతుండడంతో వాటి ద్వారా విద్యుత్తు సరఫరా అయ్యే అవకాశం ఉంది. పొరపాటున ఎవరైనా తాకితే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్తంభం పక్క నుంచే నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. వెంటనే విద్యుత్తు తీగల నుంచి మొక్కల పొదులను తొలగించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ ఎం.సాంబశివరావును వివరణ కోరగా వెంటనే స్తంభానికి అల్లుకున్న పొదుల తొలగింపునకు సత్వర చర్యలు తీసుకుంటామన్నారు.


విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న పొదులు

– న్యూస్‌టుడే, మండపేట (ద్వారపూడి)

వ్యక్తి అదృశ్యంపై కేసు

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం కాలేరు గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యంపై అంగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కాలేరుకు చెందిన యరమాటి సుబ్బయ్య (తాతరాజు)(40) గత నెల 27న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆయన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో వెతికినా సుబ్బయ్య ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు సుబ్బయ్య సోదరుడు జాన్‌ప్రసాద్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.